క్లుప్తంగా

బీఆర్ఎస్ పాలనలో ఆటో డ్రైవర్లకు అన్యాయం



నయీంనగర్: ఆటో డ్రైవర్లు ఆటోలు బంద్ పెట్టి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేస్తే గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమను పాలకులు గుర్తించకుండా అన్యాయం చేశారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ సభ్యుడు అమంచ ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లను గుర్తించి ప్రతిఏటా రూ.12వేలు ఇస్తామని తన మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తుచేశారు. ఈక్రమంలో తమ పూర్తి మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముగుసాల దేవేందర్ రెడ్డి, మహేందర్ గౌడ్, రాజు, సూరి, యాకూబ్ పాల్గొన్నారు.

బీసీలపై బీఆర్ఎస్ వైఖరిని స్పష్టం చేయాలి

హన్మకొండ: బీసీల పట్ల బీఆర్ఎస్ వైఖరిని స్పష్టం చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ తిరున హరి శేషు డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను హనుమకొండ సుబేదారిలో ఆయన సోమవారం విడుదల చేసి మాట్లాడారు. బీసీల అభివృద్ధి, సంక్షేమంపై కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలో స్పష్టమైన వైఖరి ప్రకటించాయని గుర్తుచేశారు. సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, శృంగారపు వినయ్‌చారి, నూతనకంటి ఆనందం, ఐలాపురం వేణుచారి, పాలడుగుల సురేందర్, ఎర్రబొజ్జు రమేష్, బండి డేనియల్, జితేందర్, మదన్ చంద్రబోస్ పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



హన్మకొండ: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. హనుమకొండ కుడా కాలనీలోని ఎస్‌పీఆర్ జూనియర్ కళాశాలలో సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా సహాయం కోసం వచ్చే మహిళలకు ఉచిత కౌన్సిలింగ్, న్యాయ, పోలీసు, వైద్య, తాత్కాలిక వసతి సహాయం అందించనున్నట్లు వివరించారు. వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికలు సఖి వన్‌స్టాప్ కేంద్రం ద్వారా సహాయాన్ని పొందాలన్నారు. బాధితులు తక్షణ రక్షణ కోసం 0870 – 2452112, టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో సఖి కేంద్రం కేస్ వర్కర్ వినీల, కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, డైరెక్టర్ సుధాకర్ రావు పాల్గొన్నారు.

గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాన్ని పాఠశాల పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతారం కర్ణ మాట్లాడుతూ ప్రతిఏటా పాఠశాలలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

చిత్రలేఖన పోటీల్లో 'సెయింట్ పీటర్స్' ప్రతిభ

హన్మకొండ: రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో హౌసింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల డైరెక్టర్ గోపు సునీత రెడ్డి తెలిపారు. ఎన్‌టీపీసీ హైదరాబాద్ కవాడిగూడలోని ఎన్‌టీపీసీ భవన్‌లో ఈనెల 16న నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో సీనియర్ విభాగంలో తమ విద్యార్థులు ఎం.ప్రజ్ఞశ్రీ (పదవ తరగతి), పీ.తన్విత (9వ తరగతి), జూనియర్ విభాగంలో ఎస్.శ్రీకృతి (5వ తరగతి), ఎం.ఉషశ్రీ (5వ తరగతి) నగదు బహుమతులు సాధించినట్లు వివరించారు.

పేకాట స్థావరంపై దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారిలో తెలంగాణ జంక్షన్ సమీపంలోని డీసీఎం వాహనాల పార్కింగ్ అడ్డా ప్రాంగణంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి రూ.15,950 నగదు, 6 సెల్‌ఫోన్లు, ప్లేకార్డులు స్వాధీనం చేసుకుని, ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. సమాచారం మేరకు సోమవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి డీసీఎం వాహన డ్రైవర్లు అనుమనుగండ్ల యాదగిరి, సానబోయిన కుమారస్వామి, వర్దెల్లి బాబు, గడ్డం రాజు, గొర్రె ప్రసాద్, దొడ్ల మహేందర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,950 నగదు, 6 సెల్‌ఫోన్లు, ప్లేకార్డులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటా



హన్మకొండ: వెలమ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వినయ్‌భాస్కర్



హన్మకొండ అర్బన్: మున్నూరుకాపుల సమ్మేళనానికి హాజరైన వినయ్‌భాస్కర్

● బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒక్కరు అనే నినాదంతో కార్మిక సంఘాలు పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.సాదిక్, నగర అధ్యక్షుడు సిరికొండ భిక్షపతి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు మల్లేశం, గుంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తేలు సారంగపాణి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని శ్రీనగర్ కాలనీలో, భవానినగర్‌లలో ఆయా కాలనీ వాసులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కాలనీ కమిటీలు తనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ, భారీ మెజారిటీతో గెలిపిస్తామని తీర్మానం చేసి తీర్మానం ప్రతిని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో వెలమలకు సముచిత స్థానం

రాష్ట్రంలో వెలమలకు సముచిత స్థానం ఉందని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో వెలమ కుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సమ్మేళనంలో వినయ్‌భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ వెలమ కుల సంఘం సభ్యులు తీర్మానం చేశారు. సమ్మేళనంలో వెలమ సంఘం ప్రతనిధులు మధుసూదన్ రావు, ప్రవీణ్‌రావు, కేశవరావు, ఫల్గునీ, గోపాల్‌రావు, రవీందర్ రావు, కార్పొరేటర్ బోయినిపల్లి రంజిత్‌రావు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి

హన్మకొండ అర్బన్: మున్నూరుకాపుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నగరంలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాపులందరూ తనపై పూర్తి నమ్మకం ఉంచి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, సీనియర్ సిటిజన్లు

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ఓటర్లందరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు సంయుక్తంగా రూపొందించిన కరపత్రాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఓ వజ్రాయుధం వంటిదని అన్నారు. సేవా దృక్పథం, నీతి, నిజాయితీ గల అభ్యర్థులకు ఓటు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగేందర్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్, ఉపాధ్యక్షుడు ఎన్.నర్సయ్య, సభ్యులు చెన్నూరు యాదగిరి, సదానందం, లింగారెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువ ఓటర్ల భాగస్వామ్యం పెంచడానికే స్వీప్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషా

రామన్నపేట: ఎన్నికల్లో యువ ఓటర్ల భాగస్వామ్యం పెంచడానికి స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ తూర్పు రిటర్నింగ్ అధికారి మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో ఏవీవీ కళాశాల నుంచి ఎంజీఎం చౌరస్తా వరకు సోమవారం నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి మెప్మా నుంచి ఆర్పీలు, సీఓలు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అదనపు రిటర్నింగ్ అధికారి రషీద్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, ఇండస్ట్రీస్ జీఎం నర్సింహమూర్తి, డీపీఆర్‌ఓ అయూబ్ అలీ, రాజీవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ నిర్వహణ



అదనపు ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

వరంగల్: పలు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో వరంగల్ జిల్లాకు అదనంగా వచ్చిన ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పీ.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ తూర్పు, నర్సంపేట నియోజకవర్గాలకు రెండవ బ్యాలెట్ యూనిట్లు అవసరమున్న దృష్ట్యా ఈసీఐఎల్ నుంచి అదనంగా స్వీకరించి ఏనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎంల స్ట్రాంగ్ రూంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్ల ద్వారా మొదటి దశ పరిశీలన, 10 శాతం ఈవీఎంల మాక్ పోల్‌ను సోమవారం నిర్వహించారు. ఆర్డీఓ వాసుచంద్ర, ఏఆర్‌ఓలు, డిప్యూటీ తహసీల్దార్ హనీఫ్ పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ పూర్తి

కరీమాబాద్: వరంగల్ జిల్లాలోని నియోజకవర్గాలకు సంబంధించిన మైక్రో అబ్జర్వర్ల రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సాధారణ పరిశీలకుడు షణ్ముకరాజన్ సమక్షంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, డీఐజీ అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వర్సిటీ కబడ్డీ పోటీలకు కేడీసీ విద్యార్థి



చందనను అభినందిస్తున్న రాజారెడ్డి, సోమన్న

విద్యారణ్యపురి: తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా కబడ్డీ పోటీలకు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ సెకండియర్ విద్యార్థిని ఏ.చందన ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సోమన్న తెలిపారు. ఈమేరకు కళాశాలలో చందనను ప్రిన్సిపాల్, పీడీతో పాటు కళాశాల గేమ్స్ కమిటీ సభ్యులు, అకాడమిక్ కోఆర్డినేటర్ మల్లయ్య, కమలాకర్ సోమవారం అభినందించారు.

అన్ని వర్గాల ప్రజలకు సరైన న్యాయం చేస్తా..



వరంగల్: కూరగాయల వ్యాపారులతో ప్రదీప్‌రావు



కాశిబుగ్గ: ప్రదీప్‌రావుకు మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● బీజేపీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్: వరంగల్ వెజిటేబుల్ అండ్ ఫ్రూట్స్ మార్కెట్‌లోని వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తానని బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హామీ ఇచ్చారు. వరంగల్ లక్ష్మీపురం పండ్ల, కూరగాయ మార్కెట్‌లో పలు కూరగాయలు, పండ్ల వ్యాపారులను సోమవారం పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

కాశిబుగ్గ: ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యమని, స్వయాన దేశ ప్రధాని మోదీనే విశ్వరూప సభలో వర్గీకరణకు హామీ ఇచ్చారని బీజేపీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గుర్తుచేశారు. ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో ప్రదీప్‌రావును ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల్లో తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ నియంత తరహా పాలనను అంతం చేయడానికి ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రదీప్‌రావును గెలిపించాలని ప్రచారం

కరీమాబాద్ / ఖిలా వరంగల్ : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రౌడీరాజ్యం పోయి అభివృద్ధి చెందాలంటే బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావును గెలిపించాలని ఆయన సతీమణి రేణుక పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 41వ డివిజన్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతం, శంభునిపేట, రుద్రమాంబ నగర్‌తోపాటు ఉర్సు కరీమాబాద్‌లో స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లలో నియోజకవర్గంలో భూకబ్జాలు, అవినీతి, రౌడీరాజ్యం రాజ్యమేలాయని అన్నారు. ఇప్పుడు కూడా మళ్లీ వారికి ఓట్లేస్తే రౌడీ రాజ్యం పెట్రేగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఎలాంటి మచ్చలేని మనిషి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని వివరించారు.

అందుబాటులో ఉండే వారినే ఆశీర్వదించండి



హసన్‌పర్తి: ప్రచారంలో అభివాదం చేస్తున్న అరూరి రమేష్



హసన్‌పర్తి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరూరి రమేష్

● బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి

హసన్‌పర్తి: ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేవారిని ఆశీర్వదించాలని బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సీతా నాగారం, నాగారం, సూదన్‌పల్లి, పెంబర్తి, గంటూరుపల్లి, సీతంపేట, అన్నాసాగరం, మడిపల్లి, జయగిరి గ్రామాల్లో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ అభిమానులు బతుకమ్మలు, డప్పుచప్పుళ్లతో అరూరికి సోమవారం ఘనస్వాగతం పలికారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ మూడు గంటలు విద్యుత్ చాలన్న కాంగ్రెస్‌కు ఓటు వేస్తారా.. లేక 24 గంటల పాటు కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్‌ను ఆదరిస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారంటీ కార్డులకు వారంటీ లేదని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అమితా రెడ్డి, పెద్ది తిరుపతమ్మ, అరుణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శరత్‌కుమార్, రాణి, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొండపాక సుకన్య, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

హసన్‌పర్తి: బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా 64వ డివిజన్ బీజేవైఎం యువమోర్చా జిల్లా కార్యదర్శి పల్లపు అశోక్, 66వ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు పోలెపాక నిశాంత్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు హారిక రూప్‌సింగ్‌తో పాటు కొత్తపల్లి, నాగారం, మల్లారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన నాయకులు సోమవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి అరూరి రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డి, పావుశెట్టి శ్రీధర్, మదన్ గౌడ్, నాగరాజు, దాసు తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : ప్రచారం చేస్తున్న నాయకులు

భారీ మెజార్టీతో గెలిపించాలి

పర్వతగిరి: నియోజకవర్గ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వర్ధన్నపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



శివనగర్‌లో అనఘాష్టమి వ్రతం చేస్తున్న మహిళలు



కాశీ విశ్వేశ్వరాలయంలో క్షీరాభిషేకం..

ఖిలా వరంగల్: కార్తీక మాసం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజా సామగ్రితో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతం చేశారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన ఆలయంలో సహస్ర లింగానికి 27లీటర్ల పాలతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అర్చనలు, పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, వేముల నాగరాజు, వెంకన్న, విజయ, రమ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో..

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు సోమవారం ధ్వజస్తంభం పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో దీపాలంకరణ పూజలు చేశారు.

శ్వేతార్కాలయంలో..

కాజీపేట: కార్తీక మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సోమవారం గోపాష్టమి పూజలు నిర్వహించారు. ఆలయంలో గోశాలలో ఉన్న గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. గోమాతను భక్తితో పూజించడం వల్ల కలిగే ఫలితాలను భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ వివరించారు. పూజలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట: దీపాలంకరణ పూజలు చేస్తున్న భక్తులు



గోపూజ చేస్తున్న అర్చకులు

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కేయూ క్యాంపస్: నైపుణ్యాలను పెంపొందించుకుంటే కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులకు అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల అడ్జంట్ ప్రొఫెసర్ కృష్ణమాచార్య తెలిపారు. కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నర్సింహచారి అధ్యక్షతన ఎంబీఏ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. న్యాక్ ఏప్లస్ గ్రేడ్ కలిగిన కేయూలోని వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నర్సింహచారి మాట్లాడుతూ ఖాళీ సమయంలో లైబ్రరీ, క్రీడల పట్ల దృష్టి సారించాలని చెప్పారు. బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ మాట్లాడుతూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని అన్నారు. ప్రొఫెసర్ వరలక్ష్మి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, కాంట్రాక్టు అధ్యాపకుడు ఫణీంద్ర పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

దేశాయిపేట: బాలల హక్కులను కాపాడి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాలకులు తగు చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కోరారు. బాలల హక్కుల పరిరక్షణ దినం సందర్భంగా వరంగల్ కొత్తవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 20ని బాలల హక్కుల పరిరక్షణ దినంగా 1989లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిందని గుర్తుచేశారు. బాలల సంపూర్ణ అభివృద్ధికి భారత రాజ్యాంగంలో పేర్కొన్నప్పటికి ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదని వాపోయారు. నేటికీ అనేక మంది పిల్లలు విద్యకు, కనీస సదుపాయాలకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో వారు రాణించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చందన, మధుమిత, అయేషా, నేహశ్రీ, శ్రీనిధికి బహుమతి ప్రదానం చేశారు.

జీవన్ ప్రమాణ్ పత్రాల నమోదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో దివ్యాంగులైన పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాలను సంఘం ముఖ్య నాయకుల పర్యవేక్షణలో సోమవారం ఆన్‌లైన్‌లో నమోద్ చేశారు. శారీరక సమస్యలతో బాధపడుతున్న పెన్షనర్లను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఆధునిక వైద్యం ద్వారా పైల్స్‌కు చికిత్స

నయీంనగర్: పైల్స్ వ్యాధి నివారణకు మొదటి దశలోనే ఆధునిక వైద్యచికిత్స చేయడం ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కూరపాటి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కూరపాటి రమేష్ తెలిపారు. అంతర్జాతీయ పైల్స్ దినోత్సవం సందర్భంగా హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పైల్స్ చికిత్సకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పైల్స్ వ్యాధి బారినపడిన వారు మొదటగా నాటు వైద్యులను ఆశ్రయించి చికిత్స తీసుకోవడం వలన వ్యాధి ముదిరిపోయి ప్రాణాపాయ దశలో ఆధునిక వైద్యచికిత్సకు వస్తున్నారని డాక్టర్ రమేష్ తెలిపారు. పైల్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాయామం ద్వారా కలిగే ఉపయోగాలు, పైల్స్ వచ్చిన వారు తీసుకోవాల్సిన చికిత్స పద్ధతుల గురించి ఆయన వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ కూరపాటి రాధిక, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.